క్లుప్తంగా

పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలి

మాజీ మంత్రి విడదల రజిని



చిలకలూరిపేట: పార్టీ అభ్యున్నతికి, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు అన్ని విభాగాలతో పాటు ఎస్సీ విభాగం నాయకులు కీలక పాత్ర పోషించాలని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు కొమ్మూరి చంద్రశేఖర్, ఎస్సీ నాయకులతో కలసి శనివారం మాజీ మంత్రి విడదల రజినిని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ విభాగం నాయకులతో మాజీ మంత్రి మాట్లాడుతూ పార్టీలో ఎస్సీలకు సముచిత స్థానం,గౌరవాన్ని వైఎస్ జగన్ కల్పించారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారంలో సముచిత వాటా కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కు మాత్రమే సొంతమన్నారు. ఈ సందర్భంగా కొమ్మూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు సహకారం అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కొచ్చెర్ల కిషోర్, నాయకులు మైలా రాజేష్, దాసరి చిట్టిబాబు, బండారు జయకుమార్, నలమాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారం తీసుకోవటం ద్వారా తల్లీ బిడ్డ క్షేమంగా ఆరోగ్యంగా ఉంటారని పలువురు వక్తలు తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం చంద్రబాబునాయుడు కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రసవం తరువాత తగినంత విశ్రాంతి అవసరమని, బాలింతలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రోటీన్ పౌడర్, శనగలు, బెల్లం, పండ్లు, శనగగుండ్లు వంటి పౌష్టికాహారంతో కూడిన బ్యాగ్‌లను పంపిణీ చేసారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్.కరీం మొహిద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ మేకల సునీత, క్లబ్ మాజీ గవర్నర్ తాళ్ల రాజశేఖరరెడ్డి, అడిషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి బి.మాణిక్యాలరావు, రోటరీ ప్రతినిధులు భవనం మునీందర్‌రెడ్డి, మేళ్లచెర్వు సుమిత్రకుమార్, షేక్.జిలానీ మాలిక్, తాళ్ల ఉమాదేవి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయాలి

చిలకలూరిపేట: ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ. మారుతీ వరప్రసాద్ చెప్పారు. వినుకొండలో ఆగస్టు 7,8 తేదీలలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్‌ను శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం కులమతాల మధ్య ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం చిచ్చు పెడుతోందని విమర్శించారు. మరోవైపు అలవి కాని హామీలతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను అన్ని రకాల మోసగిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వినుకొండలో నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, నాయకులు బొంతా ధనరాజ్, దాసరి వరహాలు, వేలూరు గ్రామ సర్పంచ్ బొంతా తిరుపతయ్య, షేక్ నన్నే పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

నరసరావుపేట: స్థానిక తొమ్మిదవ వార్డులోని లాల్‌బహదూర్ మున్సిపల్ హైస్కూలులో దాతల సహకారంతో మరమ్మత్తులు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం ప్రారంభించారు. టౌన్ ప్రెసిడెంట్ గట్టుపల్లి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ కుంచాల బాజి, నాయకులు అల్లంశెట్టి మోహనరావు, గూడూరు శేఖర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతి శ్రీనివాసరెడ్డికి అవార్డు

నరసరావుపేట రూరల్: ఏఎం రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డికి రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ అవార్డును ఎంపికయ్యారు. జాతీయస్థాయిలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ అవార్డును స్కిల్ ఇండియా, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్, ఈకే ఉపదేష్ మీడియా సంయుక్తంగా ప్రతి ఏడాది ప్రకటిస్తుంది. అవార్డుకు ఎంపికైన శాంతిశ్రీనివాసరెడ్డిని ఇంజినీరింగ్, ఫార్మసీ, డిప్లొమా కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు, మల్లికార్జున్, కృష్ణారెడ్డితో పాటు విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

నగదు పంపిణీ

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో సంగండెయిరీ పాలసేకరణ కేంద్రంలో పాల ఉత్పత్తిదారులకు 2024–25 సంవత్సరంలో ధరల వ్యత్యాసం కింద రూ.6,72,687 రూపాయలను శనివారం పంపిణీ చేశారు. ఈ మొత్తాన్ని రూ.100ల విలువ చేసే పాలను సరఫరా చేసిన రైతుకు రూ.6 రూపాయల చొప్పున ధరల వ్యత్యాసం అందించారు. సంగం డెయిరీ రూ.4,46,190లు సమకూర్చగా, సొసైటీ నిధుల నుంచి రూ.2,26,497లను సమకూర్చారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ రామాంజనేయులు పాల్గొన్నారు.




ప్రకాష్‌నగర్‌లోని షాలెనగర్ బీసీ బాలుర హాస్టల్‌లోని బియ్యంలో కన్పిస్తున్న ముక్కపురుగులు



షాలెంనగర్‌లోని బీసీ బాలుర హాస్టల్‌లో సామూహికంగా స్నానాలు చేస్తున్న విద్యార్థులు



నరసరావుపేట పెద్ద చెరువు ఎస్సీ బాలుర హాస్టల్‌లోని విరిగిన మరుగుదొడ్డి తలుపు



మురికిపూడి హాస్టల్‌లో వంట నిర్వహిస్తున్న సహాయకుడు

సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ట

- నరసరావుపేట ఎస్సీ బాలుర హాస్టల్‌లో గదుల్లోకి చేరుతున్న వర్షపు నీరు
- బెడ్లు లేకుండా నేలపై దుప్పట్లపైనే పడక
- కోటప్పకొండ బీసీ హాస్టల్‌కు పాములు భయం

నరసరావుపేట, నరసరావుపేట రూరల్: కూటమి ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకుంటూ నివాసం ఉండే ప్రభుత్వ హాస్టళ్లు పలు సమస్యలతో దీనాతిదీన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. హాస్టల్ విజిట్‌లో భాగంగా పట్టణంలోని పెద్దచెరువు 9వ లైనులో ఓ ప్రైవేటు బిల్డింగ్‌లో కొనసాగుతున్న ఎస్సీ బాలుర హాస్టల్, ప్రకాష్ నగర్‌లోని బీసీ బాలుర హాస్టల్ పరిశీలించటం జరిగింది. వీటిల్లో నాల్గవ తరగతి నుంచి బీటెక్ చదివే సుమారు 280 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఎస్సీ హాస్టల్‌లో వర్షం పడితే హాస్టల్ మొత్తం చిత్తడి చిత్తడిగా తయారవుతుందని హాస్టల్ విద్యార్థులు పేర్కొన్నారు. కొన్ని గదుల్లోకి నీరు వస్తుందని చెప్పారు. ఒకటి రెండు గదుల్లో సగం నీరు ఉండగా మిగతా సగంలో ఓ విద్యార్థి పడుకొని ఉండటం కన్పించింది. డ్రమ్ముల్లో పట్టిన నీటినే విద్యార్థులు తాగునీరుగా ఉపయోగిస్తున్నారు. హాస్టల్ మొదటి అంతస్తు కారిడార్ మధ్యలో నీరు పోయేందుకు కాలువ ఏర్పాటు చేశారు. అలాగే విద్యార్థులు పడుకునేందుకు ఎక్కడా బెడ్లు అనేవి లేవు. గదుల్లోని నేలపై చాపలు, దుప్పట్లు పర్చుకొని పడుకుంటున్నారు. బీసీ బాలుర హాస్టల్‌లో మూడవ తరగతి నుంచి పదోతరగతి వరకు ఉన్న విద్యార్థులు సామూహికంగా స్నానాలు చేయటం కన్పించింది. బియ్యంలో ముక్కపురుగులు కన్పించాయి. ప్రభుత్వం సన్నటి బియ్యం సరఫరా చేస్తున్నారని వంటచేసే మహిళలు పేర్కొన్నారు.



వినుకొండలో మూతపడిన బాలుర వసతిగృహం

వసతులు లేక అవస్థలు

కోటప్పకొండ బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోటప్పకొండలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోనే ఉన్న ఈ హాస్టల్‌కు ప్రకాశం జిల్లాతో పాటు వినుకొండ ప్రాంతాల నుంచి విద్యార్థులు చేరుతుంటారు. కొండ పక్కనే ఈ వసతి గృహం ఉండటంతో పాములు హాస్టల్ ప్రాంగణంలోకి తరచూ వస్తున్నాయి. మరుగుదొడ్లు ఆరు బయట ఉండటంతో రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే విద్యార్థులు భయపడాల్సి వస్తుంది. దీంతో పాటు విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు అందుబాటులో లేవు. విద్యార్థులు స్నానాలు చేసేందుకు సమీపంలోని త్రికోటేశ్వర జెడ్పీ హైస్కూల్‌పై ఆధారపడాల్సి వస్తుంది. హాస్టల్ ఆధునీకరించి మంచాలు అందుబాటులోకి తీసుకొచ్చారు



తలుపులు లేని గదులు



కోటప్పకొండలోని బీసీ బాలుర వసతి గృహం

జిల్లాలో హాస్టళ్లు ఇలా...

జిల్లాలో బీసీ సంక్షేమ శాఖలో ప్రీ మెట్రిక్ హాస్టళ్లు 20 ఉండగా అందులో నాలుగు బాలికలకు, 16 బాలురకు ఉన్నాయి. వీటిల్లో మూడో తరగతి నుంచి పదివరకు విద్యార్థినీ విద్యార్థులు 1400 మంది వరకు ఉన్నారు. అలాగే పోస్ట్ మెట్రిక్ 14 ఉన్నాయి. వీటిలో ఇంటర్మీడియేట్ నుంచి పీజీవరకు చదివే వెయ్యిమందివరకు విద్యార్థులు ఉంటున్నారు. అలాగే జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు 12 ఉండగా వీటిలో మూడోతరగతి నుంచి పీజీవరకు చదివే 1670 మంది విద్యార్థులు ఉన్నారు.

కాని గదులకు తలుపులు ఏర్పాటు చేయలేదు. హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో ఉండకపోవడం, సీనియర్ విద్యార్థుల వేధింపులు, నాణ్యమైన ఆహారం ఇవ్వకపోవడం వంటి కారణాలతో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. గత ఏడాది 80 మంది విద్యార్థులు ఉన్న హాస్టల్‌లో ఈఏడాది కేవలం 30 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. గత నెల 31వ తేదీ హాస్టల్ వార్డెన్ ఉద్యోగ విరమణ చేయగా, నూతనంగా మరో వార్డెన్‌ను ఉన్నతాధికారులు నియమించారు.

అరకొర వసతులతోనే సరి

చిలకలూరిపేట: సంక్షేమ హాస్టళ్లలో సంక్షేమం కొరవడుతోంది. భావిభారత పౌరులను తీర్చి దిద్దాల్సిన వసతి గృహాలు వసతుల లేమికి ప్రతి రూపాలుగా నిలుస్తున్నాయి. నిరుపేద విద్యార్థులకు ఆశ్రయం కల్పించి, ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడాల్సిన వసతి గృహాలు నిర్లక్ష్యానికి ప్రతి రూపాలుగా కునారిల్లుతున్నాయి. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఇబ్బందులపై



వినుకొండలో ఆరుబయట స్నానానికి ఏర్పాటు చేసిన కళాయిలు



మురికిపూడి హాస్టల్‌లో అధ్వానంగా మరుగుదొడ్లు

స్వయానా ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించటమే దీనికి నిదర్శనం. జాతీయ బాలల హక్కుల పరిరక్షణా కమిషన్ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం, పరుపులు, దుప్పట్లు, తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హైకోర్టు తేల్చి చెప్పింది.

సర్వత్రా వసతుల కొరత...

ఈ క్రమంలో చిలకలూరిపేటలో ఉన్న హాస్టళ్ల పరిస్థితిని పరిశీలిస్తే పట్టణంలోని ఓ ప్రైవేటు భవంతిలో డిగ్రీ బాలికల బీసీ హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ 40 మంది విద్యార్థినిలు వసతి పొందుతున్నా సరిపడ గదులు లేవు. తాగునీటి శుద్ధి యంత్రం (ప్యూరిఫయర్) లేకపోవడం దురదృష్టకరం. అలాగే బీసీ బాలుర వసతి గృహం సైతం ఓ పాత కాలం నాటి ప్రైవేటు భవనంలో కొనసాగుతుంది. ఇక్కడ వసతుల లేమితో కేవలం 35 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారు.

మరుగుదొడ్ల పరిస్థితి దారుణంగా ఉంటుంది. పురుషోత్తమ పట్నంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో 62 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇక్కడ వాష్‌రూములు సరిగా లేకపోవడం ఆరుబయట స్నానాలు ఆచరిస్తుంటారు. దోమల సమస్య తీవ్రంగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు. ఇక సొంత భవనంలో కొనసాగుతున్న పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 70 మంది విద్యార్థులు ఉంటున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉంటాయి. వంట సహాయకుడు లేడు. ఇక్కడ కూడా విద్యార్థులు ఆరు బయట స్నానాలు చేస్తుంటారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేట మండలంలోని మురికిపూడి గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహంలో 100 మంది విద్యార్థులు ఉన్నాయి. ఇక్కడ వంట మనిషి లేకపోవడంతో కేవలం సహాయకుడు మాత్రమే వంట పనులు నిర్వహిస్తుంటాడు. మరుగుదొడ్లు శుభ్రత లేక దుర్వాసన వెదజల్లుతుంటాయి. ఇక రాజాపేట గ్రామంలోని ఏపీ గురుకుల పాఠశాలలో అత్యధికంగా 285 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఒక్క ప్రిన్సిపాల్ మినహాయించి విద్యాబోధన చేసే వారంతా ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులే. క్యాటరింగ్ ద్వారా వచ్చే భోజనం రుచిగా ఉండటం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

అద్దె భవనంలో వసతిగృహం

వినుకొండ: వినుకొండ పట్టణంలో సాంఘికసంక్షేమ బాలురవసతి గృహం శిథిలావస్థకు చేరడంతో గత రెండేళ్లుగా ప్రయివేటు అద్దె భవనంలో వసతిగృహం ఏర్పాటు చేశారు. అయితే నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల హాస్టల్‌లో 80 మంది పిల్లలను కలిపి వసతి కల్పించడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం బాలుర వసతి గృహంలో స్నానానికి, కుళాయిలు ఏర్పాటు చేశారు కానీ స్నానపుగదులు మాత్రం లేక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. 80 మందికి కేవలం 3 మాత్రమే మరుగుదొడ్లు ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గం కొంత కాలం నుంచి ఇబ్బందులు పడుతున్నప్పటికీ నూతన భవనం ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో విద్యార్థుల పాలిట శాపంలా మారింది. దీంతో కనీస వసతులు లేక పోవడం విద్యార్థుల కష్టాలు రెట్టింపయ్యాయి.

మోసపూరిత పాలనను ప్రతీ ఇంటికీ చెబుదాం

- వార్డుల వారీగా బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ విజయవంతం చేద్దాం
- వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి

చిలకలూరిపేట: మోసపూరిత పాలన గురించి ఇంటింటికీ తెలియజేద్దామని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి చెప్పారు. పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి విడదల రజిని నివాసంలో పట్టణ పరిధిలోని వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జులతో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమ నిర్వహణ గురించి సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డు పరిధిలో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న వంచన గురించి వివరిద్దామని వెల్లడించారు. ప్రజలు కూటమి పాలనలో మోసపోయామని గుర్తిస్తున్నారని, ఎలా మోసపోయింది తెలుసుకుంటున్నారని వివరించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నవరత్నాల పాలన అందిన విషయం ఇప్పుడు ప్రజలు మననం చేసుకుంటున్నారని వెల్లడించారు. ఎవరిని కలిసినా పెన్షన్లు రావడం లేదు... అమ్మఒడి రావడం లేదు అని వాపోతున్నారని తెలిపారు. నాడు కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేశారని ప్రస్తుతం పచ్చచొక్కా వేసుకుంటేనే పించన్ ఇస్తామంటూ వేధిస్తున్నారని ఆరోపించారు.



క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గత వైఎస్సార్ సీపీ పాలనలో ఏ ఇంటికీ ఎన్ని సంక్షేమ పథకాలు లభించాయి, ఏ వార్డులో ఎంత అభివృద్ధి జరిగింది అని చర్చ ఉండేదని, నేడు ఎంత మందిపై కేసులు నమోదు చేశారు అని చర్చ జరుగుతోందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు కుప్పాల ప్రభుదాస్ నాయుడు, కౌన్సిలర్లు షేక్ యూసుఫ్ ఆలి, సాపా సైదావలి, షేక్ సుభాని,అన్నపరెడ్డి ఈశ్వర్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏకాంబరపు సునీత, క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు మైలా రాజేష్, పట్టణ ఉపాధ్యక్షుడు గోవతోటి జాన్, ప్రధాన కార్యదర్శులు బండారు జయకుమార్, తియ్యగూర అంజిరెడ్డి, కార్యదర్శి షేక్ బడేమియా, నాయకులు సయ్యద్ జమీర్, కొప్పుల రావూరి పటేల్, శివమణి దరియావలి, అంజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలి

నిరసన వ్యక్తం చేసిన యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

నరసరావుపేట: ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలని, రెండు నెలలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న క్యాడర్ స్ట్రెంత్ సమస్య వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు మాట్లాడుతూ యోగాంధ్ర, మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు, శిక్షణ తరగతుల పేరుతో అనేక కార్యక్రమాలు ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నాయన్నారు. బదిలీలు జరిగినా వేలాది ఉపాధ్యాయులు రిలీవ్‌కు నోచుకోలేదని అన్నారు. వేలాది స్కూళ్లు సింగిల్ టీచర్లతోనే పని చేస్తున్నాయన్నారు. పేరుకు ఐదుగురు టీచర్లను ఇచ్చినా కేవలం ఇద్దరితోనే పనిచేస్తున్నాయన్నారు. సెలవులు ఉపయోగించుకోకుండా ఆంక్షలు పెట్టారన్నారు. సుమారు 25 వేల మంది ఉపాధ్యాయులు రెండు నెలలుగా జీతాలు లేకుండా చేయడంపై వారు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. తమ ఆందోళనను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.



నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

సంక్షిప్త వార్తలు

■ నేడు వైఎస్సార్ సీపీ గుడ్‌మార్నింగ్ నరసరావుపేట

నరసరావుపేట: పట్టణంలోని అరండల్‌పేటలోని మోర్‌సెంటర్‌లో ఆదివారం ఉదయం ఏడుగంటలకు గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటిస్తారని పార్టీ కార్యాలయ ప్రతినిధులు శనివారం పేర్కొన్నారు. స్థానిక ప్రజలతో సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కార మార్గాలను గురించి చర్చిస్తారన్నారు.

■ నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

నరసరావుపేట టౌన్: స్థానిక విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కూడా బిల్లులు చెల్లించవచ్చు అని నరసరావుపేట డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బిల్లులు చెల్లించవచ్చు అన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

■ కంపెనీ సెక్రటరీ కోర్సుకు భవిష్యత్

నరసరావుపేట ఈస్ట్: కంపెనీ సెక్రటరీ కోర్సు చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని కంపెనీ సెక్రటరీస్ అమరావతి చాప్టర్ ఛైర్మన్ ఎన్‌వీఎస్ నాగరాజు తెలిపారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెని సెక్రటేరియేట్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) అమరావతి చాప్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అవగాహన సదస్సుల ద్వారా విద్యార్థులకు స్పష్టమైన మార్గదర్శకం అందుతుందని తెలిపారు. సదస్సులో కంపెనీ సెక్రటరీ ఏ.రాములు, ఐసీఎస్ఐ కార్యాలయ ప్రతినిధి వై.ఎం.విష్ణు, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

■ 50మందికి పౌష్టికాహారం పంపిణీ

నరసరావుపేట: స్థానిక సీబీ కాలనీలోని కమ్యూనిటీ హాలులో శనివారం నరసరావుపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు శనగలు, శనగగుళ్లు, బెల్లం, బిస్కెట్స్, ప్రోటీన్ పౌడర్, ఫ్రూట్స్ కలిగిన 50 మందికి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ మేకల సునీత, రోటరీ క్లబ్ అధ్యక్షులు షేక్ కరీం మొహిద్దిన్, పూర్వ గవర్నర్ తాళ్ల రాజశేఖరరెడ్డి, సెక్రెటరీ భవనం మునీందర రెడ్డి, పూర్వ ప్రెసిడెంట్ మేళ్లచెరువు సుమిత్రకుమార్, డైరెక్టర్ షేక్ జిలానిమాలిక్, రోటేరియన్ తాళ్ల ఉమాదేవి, నరసరావుపేట అడిషనల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.మాణిక్యాలరావు, సూపర్‌వైజర్స్ జోజమ్మ, గౌసియా, అంగన్వాడీ టీచర్స్ వేముల పద్మావతి పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వక్తలు కోరారు.

■ సాతులూరు గ్రామాన్ని సందర్శించిన డీఎల్‌పీవో

నాదెండ్ల: సాతులూరు గ్రామ పంచాయతీని ప్రభుత్వం స్వర్ణ గ్రామ పంచాయతీగా ఎంపిక చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం నరసరావుపేట డీఎల్‌పీవో లక్ష్మణరావు గ్రామాన్ని సందర్శించారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచి మంచినీటి పథకంలో క్లోరినేషన్ చేసి దోమల నివారణకు పిచికారీ చేయాలన్నారు. ఇంటిపన్ను వసూళ్లకు తగు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో తోకల వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య, చందవరం కార్యదర్శి అంకయ్య ఉన్నారు.

■ బాలింతలకు పౌష్టికాహారం

నాదెండ్ల: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహార పంపిణీ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు భవనం వెంకటేశ్వరరావు, వైద్యాధికారి కవితా అనసూయ పౌష్టికాహార కిట్లను అందించారు. బాలింతలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు.

Happy Parents DAY
పేరెంట్స్ డే శుభాకాంక్షలు...
25
సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ (Regd No:13/03) సెల్ - 9492471040
శ్రీరామా పబ్లిక్ స్కూల్
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపు పొందిన సంస్థ
నర్సరీ నుండి 7వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం.
శావల్యాపురం – కొత్తలూరు

పేరెంట్స్ డే శుభాకాంక్షలు
ఈ లోకంలో నువ్వు ద్వేషించినా కూడా...
నిన్ను ప్రేమించే వాళ్ళు ఉన్నారు అంటే
అది కేవలం తల్లిదండ్రులు మాత్రమే
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
పేరెంట్స్ డే శుభాకాంక్షలు
నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్
యడ్లపాడు గ్రామం, మండలం
తహశీల్దార్ కార్యాలయం ఎదుట, యడ్లపాడు

కాసు సెంట్రల్ మాల్
కమర్షియల్ షాప్స్ / ఆఫీస్ స్పేస్ లీజుకు
పల్నాడు జిల్లా కేంద్రం, నరసరావుపేట పట్టణం, పల్నాడు రోడ్‌లో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న కాసు సెంట్రల్ మాల్ నందు 300 చ.అ.ల నుండి 5000 చ.అ.ల కమర్షియల్ షాప్స్/ఆఫీస్ స్పేస్ లీజుకు ఇవ్వబడును. ఆసక్తి గల వారు సంప్రదించగలరు. సెల్ : 9000257054

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, పుట్టినరోజు, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఆహ్వాన ప్రకటనలు
శ్రద్ధాంజలి, నివాళులు, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com